మహా పత్రిక
సోమవారం, హైదరాబాద్ | 15-09-2025
సాహిత్యం LITERATURE 04

భారతీయ రచయిత

కవిత్వం అనేది మానవుడి అజేయత్వానికి సాక్ష్యమని నమ్ముతాను

స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఉద్యోగిగా2023 పదవీ విరమణ చేసి ప్రవృత్తి రీత్య కథా రచయితగా కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీతగా ప్రసిద్ధులు అయిన ప్రదీప్ బీహారీతో కరచాలనం:

కథా రచయిత: ప్రదీప్ బీహారీ

1. మీ జన్మస్థలం, విద్యాభ్యాసం, కుటుంబ నేపథ్యం.?

జన్మస్థలం - బిహార్ రాష్ట్రంలోని మధుబనీ జిల్లాలో ఖజౌలి బ్లాక్ పరిధిలోని కన్హౌలి మల్లిక్ టోలా అనే గ్రామం. విద్య - ఎం.ఏ (నాటకం). కుటుంబ నేపథ్యం - ఉద్యోగ వర్గం. రచన,నటన కూడా నా ప్రవృత్తులు.

2. మీరు రచయిత ఎలా అయ్యారు? మీ ప్రేరణ ఏమిటి?

బాల్యంలో నా అమ్మమ్మనాకు పాఠ్య పుస్తకాలలోని కథలు చెప్పడంతో మొదలయ్యింది. ఆ తరువాత సమాజం మెరుగుదలకు నా అభిప్రాయాలను పంచుకోవడమే లక్ష్యమైంది. నాకు నిత్య ప్రేరణ - చివరి వరుసలో కూర్చున్న సాధారణ ప్రజలు.

3. సాహిత్యంలో మీకు ఇష్టమైన ప్రక్రియ ఏది? ఎందుకు?

నాకు నచ్చే ప్రక్రియ చిన్న కథలు, నవలలు, నాటకాలు. ఎందుకంటే ఈ ప్రక్రియల్లోనే నాకు సౌలభ్యం అనిపిస్తుంది.

4. మీరు ద్విభాషా రచయితనా? ఏ భాషలో ఎక్కువ సౌకర్యంగా రాస్తారు?

అవును. మైథిలీ , హిందీలో రాస్తాను. అయితే నాకు అత్యంత సౌకర్యంగా అనిపించేది నా భాష ,మాతృభాష మైథిలీ.

5. ఇప్పటివరకు ఎన్ని పుస్తకాలు ప్రచురించబడ్డాయి? మీ రచనల ఆత్మ ఏమిటి?

మొత్తం ప్రచురించిన పుస్తకాలు - 29 చిన్న కథల సంకలనాలు - 10, నవలలు -07,లేఖల సంకలనం - 01, అనువాద గ్రంథాలు - 08 (నేపాలి,హిందీ,ఒరియా నుంచి అనువాదాలు), సంపాదకత్వం వహించిన పుస్తకాలు - 03 సంపాదకత్వం వహించిన పత్రికలు - 03 (అంతరంగ్ అనే అనువాద పత్రిక హిందీలో ఇప్పటివరకు 34 సంచికలు ప్రచురించబడ్డాయి, ఇంకా కొనసాగుతున్నాయి). నా చిన్న కథలలో చాలా హిందీ, నేపాలి, మలయాళం, డోగ్రి, రాజస్థానీ, అస్సామీ, ఒరియా, గుజరాతీ, పంజాబీ, ఉర్దూ, తెలుగు మరియు ఇంగ్లీష్ వంటి భాషల్లోకి అనువదించబడి, ప్రామాణిక పత్రికలలో ప్రచురించబడ్డాయి. మైథిలీ నాటక రంగంలో నటుడిగా, దర్శకుడిగా కృషి చేశాను . మైథిలీ టెలీఫిల్మ్‌లలో కూడా నటుడిగా, దర్శకుడిగా భాగస్వామ్యం వహించాను. సరోకార్ నా మైథిలీ కథల సంకలనం 2007లో సాహిత్య అకాడమీ అవార్డు గెలుచుకుంది. అది హిందీ, నేపాలి, మలయాళం, రాజస్థానీ, డోగ్రి భాషల్లోకి అనువదించబడింది. రచనల ఆత్మ - సమాజంలోని బాధితుల పక్షాన నిలవడం. మనుషుల మధ్య మానవత్వాన్ని కాపాడడం.

6. కవిత్వం మీ దృష్టిలో ఏమిటి? మీ నిర్వచనం చెప్పండి?

నేను కవిత్వం రాయను. కానీ కవిత్వం అనేది మానవుడి అజేయత్వానికి సాక్ష్యమని నమ్ముతాను.

7. మీ దృష్టిలో మైథిలీ సాహిత్యంలో ప్రస్తుత ధోరణులు ఏమిటి?

సమకాలీన జీవితం, సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని, మైథిలీ సాహిత్యం జాతీయ పరిసరాల మార్పులకి అనుగుణంగా సానుకూల దిశలో సాగుతోంది. అది మానవీయ స్పృహను కాపాడేందుకు కట్టుబడి ఉంది. మంచి అంటే మంచి, చెడు అంటే చెడు అని చెప్పగల సాహసాన్ని కలిగి ఉంది.

8. మీరు అందుకున్న పురస్కారాలను చెప్పండి.?

యువజనోత్సవం, బిహార్‌లో ఉత్తమ నటుడు అవార్డు, జగదీశ్ చంద్ర మాథుర్ సమాన్, మహేశ్వరి సింగ్ మహేశ్ గ్రంథ పురస్కార్, దినకర్ జనపదీయ సమ్మన్, సాహిత్య అకాడమీ అవార్డు ,భాషా సమన్వయ సమ్మన్ , కేరళనుండి.

9. మీ కవితలు రాసారా..మీకు ఇష్టమైన పంక్తులను చెప్పగలరా?

నేను కవిత్వం రాయలేదు .

ఇంటర్వ్యూ:
డాక్టర్ పెరుగు రామకృష్ణ,
9849230443

ఉత్తరాల శీర్షిక పాఠకుల హక్కు

- బద్రి నర్సన్,
9440128169

పత్రికలకు పాఠకుల ఆదరణయే ప్రాణవాయువు. చదివేవారు ఉంటేనే రచనలకు సార్థకత. రచనలను పాఠకులకు మధ్యవారధి పత్రికలు. చివరకు రచయితల, పత్రికల పనితనాన్ని నిర్ణయించే తీర్పరులు మాత్రం పాఠకులే. అందుకే ఓ పత్రిక 'పాఠక దేవుళ్ళకు నమస్కారం' అని ప్రతి వారం స్మరిస్తోంది. పాఠకులు కూడా చదివి ఊరుకోకుండా తమ అభిప్రాయాలను ఉత్తరాల ద్వారా పత్రికలకు తెలియజేస్తుంటారు. పత్రికలకు ఇష్టంగా జాబులు రాయడం కొందరికి అలవాటైన అభిరుచి. అలా వచ్చే ఉత్తరాల కోసం అన్ని పత్రికల్లో ఓ ప్రత్యేక శీర్షిక పేరిట కొంత స్థలాన్ని కేటాయించేవారు. దినపత్రికల్లో సంపాదకీయం పేజీ కుడివైపు కింది భాగాన లేదా చివరి కాలమ్స్ లో రెండు,మూడు లేఖలు తప్పనిసరిగా ఉండేవి. వార, మాస పత్రికల్లో ముందరి ఒకటి, రెండు పేజీల్లోనే వీలయినన్ని ఉత్తరాలు వేసేవారు. ఆ శీర్షికల ద్వారా పత్రికలకు, రచయితలకు, పాఠకులకు ఒక అనుబంధం ఏర్పడేది.

ఒక పేరాలో ఇమిడే ఈ ఉత్తరాల్లో క్లుప్తంగానే ఎన్నో విషయాల ప్రస్తావన ఉండేది. దినపత్రికల్లో జనవాక్యం ఏ రోజూ బోసిపోలేదు. అది ధర్మగంటలా ధ్వనించేది. ప్రభుత్వ నిర్ణయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న ప్రాంతీయ సమస్యలు, వాటికి సూచనలు లాంటి ఎన్నో విషయాలను ఆ ఉత్తరాలు చెప్పేవి. సమస్యలను పట్టించుకొనే ఉత్తరాల రచయితలు పాఠకులకు గుర్తుండేవారు. తవుటు రామచంద్రం అనే ఉత్తరాల రచయిత తరచుగా స్థానికంగా ప్రజల ఇబ్బందుల గురించి రాసేవారు. పూడూరు రాంరెడ్డి వ్యవసాయ సంబంధిత అంశాలపై వెంటనే ఉత్తరాల రూపంలో స్పందించేవారు. విత్తనాల, ఎరువుల కొరత, మద్దతు ధరలు, వరదల్లో పంట నష్టం లాంటి ఎన్నో విషయాలపై ఆయన సరియైన సమాచారం ఇచ్చి ప్రభుత్వ చర్యలను కోరేవారు. ఇలాంటి ఎందరో బాధ్యత గల పౌరులు సామాజిక అంశాలను ఉత్తరాల శీర్షిక ద్వారా వెలుగులోకి తెచ్చేవారు.

కాల్పనిక రచనలకు ప్రాధాన్యతనిచ్చే వార, మాస పత్రికలకు పాఠకులు రాసే ఉత్తరాల తీరు వేరుగా ఉంటుంది. పత్రికలో వచ్చిన కథలు, సీరియళ్లు, ఇతర వ్యాసాలపై పాఠకులు తమ స్పందనను ఉత్తరాల ద్వారా తెలియజేస్తుంటారు. రచనలను ఆసక్తిగా చదివి, వాటిలో తమకు నచ్చిన లేదా నచ్చని అంశాలను అందులో పేర్కొంటారు. ఒక రచన చదివి, ఆకళింపు చేసుకొని, దాన్ని విశ్లేషిస్తూ నాలుగు వాక్యాలు రాయడం కూడా ఓ సాధనయే. చాలా మంది రచయితలకు రచనాక్షరాభ్యాసం ఇలా ఉత్తరాలతోనే మొదలైందని చెప్పవచ్చు. పత్రికలు కొనుక్కొనే స్తోమత లేకున్నా స్థానిక గ్రంథాలయాల్లో అన్ని రకాల పత్రికలు చదివిన జ్ఞాపకాలు చాలా మందికే ఉంటాయి. లైబ్రరీలకు అన్ని దిన, వార, మాస పత్రికలు వస్తుండేవి. వార పత్రికలు చేతికి చిక్కడమే తరువాయి తలెత్తకుండా మొత్తం చదివేసిన సందర్భాలు మర్చిపోలేనివి. ఆ యుక్తవయసులోనే వార పత్రికలకు ఉత్తరాలు రాసే అలవాటు ఎందరికో అలవడింది. ముఖచిత్రం పైనున్న అందాల నటి ప్రస్తావనతో పాటు పత్రికలో వచ్చిన సీరియళ్లపై కథనం, కథల విశిష్టత తెలియజేసే ఉత్తరాలు పత్రికల్లో కనబడేవి. ఉత్తరాలు రాయడం మొదలయ్యాక పత్రికలో అది వేశారా లేదా అనే ఉత్కంఠభరిత నిరీక్షణం మరో మెట్టు. ఉత్తరాల రచయితగా పత్రికలో మొదటిసారిగా పేరు చూసుకోవడం ఓ అపురూప జ్ఞాపకం. అలా ఒక్కొక్క మెట్టు ఎక్కి రచయితలైన వారు కొందరైతే, అంతటితో కాడి దింపేసినవారు చాలామందే ఉంటారు.

విచారకరమైన విషయమేమిటంటే ఇంత ప్రముఖ చరిత్ర, నేపథ్యమున్న ఉత్తరాల శీర్షికలు నేడు దాదాపు అన్ని పత్రికల్లో మాయమైనాయి. ఎందుకోగానీ తెలుగు దినపత్రికల్లో ఉత్తరాల శీర్షికలు పూర్తిగా ఎత్తివేశారు. పత్రికల్లో పౌర గొంతుక మూగపోయింది. సమాజం పట్ల ఆసక్తి ఉన్నవారి నాలుగు మాటలు ఎవరికీ అందని స్థితి వచ్చింది. వారి లేఖలను ఎవరు చదవడం లేదని పత్రికలు అనుకుంటే అది పొరపాటే. పత్రికల్లో వచ్చిన ఉత్తరాల ద్వారా ఎత్తి చూపిన సమస్యలను సంబంధిత అధికారులు స్పందించిన సందర్భాలు ఉన్నాయి. దినపత్రికల్లో ఉత్తరాల శీర్షిక ఓ వార్తాకదంబమే. ఆంధ్రభూమిలో జనవాక్యం అనే శీర్షికకు ఎంతో ప్రాధాన్యముండేది. ఒక వ్యాసం వచ్చేంత చోటును ఎడిట్ పేజీలో ఉత్తరాలకు కేటాయించేవారు. ఆ రోజుల్లో తెలంగాణ వెనుకబడిన స్థితిగతులు వాటిలో కనబడేవి. 'ఈనాడు లేఖలు' పాఠకుల దృష్టిని ఆకర్షించేలా ఉండేవి. ఇన్ని పత్రికలు ఉన్నా ప్రస్తుతం పాఠకుల మాటకు గౌరవం లేకుండా పోయింది.

చాలా మట్టుకు వార పత్రికలు మూతబడి దినపత్రికల ఆదివారం అనుబంధాలే వారపత్రికల స్థానాన్ని గుడ్డిలో మెల్లలా పూరిస్తున్నాయి. ఒక కథ, కొన్ని కవితలు, వీలైతే పుస్తక సమీక్షలు వేస్తూ సాహిత్యానికి తగు స్థానాన్ని ఇస్తున్నాయి. వీటిలో కూడా పాఠకులు అభిప్రాయాలు తెలిపే ఉత్తరాల శీర్షికలు ఒకటి, రెండు పత్రికల్లో తప్ప మిగతా వాటిలో ఎత్తివేశారు. ఉన్న కొన్ని పేజీల్లో ఉత్తరాలకు చోటెక్కడది అన్నట్లుగా పత్రికల ధోరణి ఉంది. ఆంధ్రజ్యోతి, సూర్య పత్రికలు ఆదివారం సంచికలో ఉత్తరాలు వేస్తున్నాయి. స్వాతి వార, మాస పత్రికల్లో ఉత్తరాలకు తగిన చోటు ఉంటోంది. ఇంగ్లీషు పత్రికల్లో మాత్రం 'లెటర్స్ టు ఎడిటర్' అనే శీర్షిక ఎన్నడూ ఆగిపోలేదు. జాతీయ, అంతర్జాతీయ విషయాలు అందులో చర్చించబడతాయి. ఉత్తరాల మాధ్యమంగా ఆ శీర్షికలో చర్చ కూడా జరుగుతుంది. తెలుగు పాఠకుల ఆలోచనలు కూడా ఇలా వెలుగు చూడాలి. అందుకోసం అన్ని పత్రికలు పేజీలో ఒక కాలమ్ లో బెత్తెడు చోటైనా పాఠకుల స్పందనకు ఇస్తే ఆ శీర్షికలు మళ్ళీ చిగురిస్తాయి.

రేపటి తాండవం

ప్రజా సూర్యుడు
కురుసే మేఘాల మాటున
మండుతున్నాడు

ఆదివాసుల చంద్రుడు
రక్తవర్ణక్రోధితిడై
మసలుతున్నాడు

సాయుధ దళాల లా
పీడిత నక్షత్రాలు
రేపటి
ప్రజాప్రకృతి తాండవం

- రేడియమ్,
9291527757

కటౌట్ ???

గొప్ప గొప్ప గా అనుకున్న మనుషులంతా
కటౌట్ లుగా
మారిపాతున్నారు -----
చౌరస్తాలన్నీ పోటీపడిన కటౌట్లతో
జాతరో జాతర !!
కటౌట్లకే గజ మాలలు !
కటౌట్ అసలు వ్యక్తి కన్నా ఎత్తు శిస్తు ----
రంగులు రంగులమయం !

గాలి వాన దుమారం వచ్చేనా
ఊగి ఊగి కటౌట్ ఔట్ ఫట్ !
ఎవరిమీదైనా పడితే పరలోక యాత్రే !
శిక్ష ఎవరికీ !
కటౌటుకా !!
అసలు సదరు కటౌట్ మహాశయుడికా !
సమాధానం కటౌట్ చెపుతుందా !
ఎన్నికలోస్తే
నగరమంతా కటౌట్లమయం ---
ప్రత్యర్థుల పై కోపం వస్తే
కటౌట్లు ధ్వంస రచన !
శోభాయమానమైన నగరం శోకాయమానం !!
ఇది ఏం సంస్కృతీ
వికృతి !

- కందాళై రాఘవాచార్య,
8790593638

స్వప్న కాంక్ష

కలల్ని కనాలి
కన్నీటిని తుడిచే కలల్ని
నావను తీరానికి నడిపే కలల్ని
నవ్వు దీపంతో దుఃఖపు ఇరుల దారుల్ని దాటించే
కలల్ని కంటూనే ఉండాలి.

ఈ ముళ్లూ రాళ్లూరప్పల అపనమ్మకపు
మృత్యుముఖ మార్గంలో
ఊహాపోహలైతేనేం
కలలొక్కటే
బతుకవుతాయి

తెల్లారుతూనే కల
పూవుపై వాలిన సీతాకోకచిలుకలా
ఎటో ఎగిరి పోవచ్చు
అది సుతిమెత్తగా తాకిన గుర్తులూ
నీ చూపుల పాపల్ని
ఎత్తుకుని తిప్పిన దాని వన్నెవన్నెల రెక్కలూ
ఏవీ నీకు గుర్తుకు రాకపోవొచ్చు

బహుశా
అది నిన్ను ఆవహించి
నీ చీకట్లను తన రంగుల వెన్నెలలో ముంచి
తన అలల ఊయలలో ఊపుతూ
ఒడ్డుకు చేర్చి అదృశ్యమై పోయి ఉంటుంది

అది వెళుతూ
అందించిన భరోసా ఏదో
నీకే తెలియకుండా
నిన్ను నిటారుగా నిలబెడుతుంది

నీవు కన్న కలకు తలాతోక ఉండకపోవచ్చు
కన్నీళ్లలో నానీనానీ పిడచకట్టుకు పోయి
జారిపోతున్న నిన్ను నిలుచోబెట్టే వెన్నెముకనైతే
ఉంటుంది

మళ్లీ నిన్ను నీవు కూడదీసుకుని
ఈ దుఃఖసాగరాన్ని ఈదడానికైనా
కలల్ని కంటూ ఉండాలి.

- మడిపల్లి రాజ్‌కుమార్,
9949 699 215

రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు, పుస్తక సమీక్షలు మొదలైనవి..

మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

నిర్బంధ వాక్యాలు రెక్కలు తొడుక్కుంటూ...

- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
9177732414

పుస్తక సమీక్ష

దశాబ్దాలుగా చీకటి గూళ్లలో కునారిల్లుతూ ఆశాగగనాల్లో, ఆశయాల తొలకరి మేఘాల వెంట స్వేచ్ఛగా ఎగరాలనుకునే జీవితాల కలల రెక్కల్ని ఎప్పటికప్పుడు విరిచేసే అణచివేత రాబందుల బహుముఖ పెత్తనాలను బహుముఖంగా నిరసిస్తూ బహుజన సామాజిక సంవేదన ధిక్కార కవిత్వపు సెగలుగా ఎగిసిపడుతూనేవుంది. ఉప్పొంగే అస్తిత్వవేదనాసముద్రాలు భవిష్యత్తు అలలరాగాల్ని వినిపిస్తూనేవున్నాయి. విచక్షణవెన్నెల వెలుగుల్ని సోకనీయకుండా ఆలోచనల్ని చీకటిముడుల్లోనే చిదిమివేసే అల్పపీడనాల కుతంత్రాలకు అక్షరరూపమిస్తూ మళ్లీ మళ్లీ సూర్యోదయాలకు తెరతీసే బృహత్తర కార్యాన్ని బహుజన కవిత్వం తన భుజస్కంధాలమీద వేసుకుంది. వివక్ష, అసమానతల ఎగుడుదిగుడుల పుడమి దుఃఖపు సామాజిక సంఘర్షణలోని బహుముఖ పార్శ్వాలను పుక్కిటపట్టుకుంది. ఆ దిగులు మేఘాలు అక్షరాల కుభవృష్టిని కురిపిస్తోంది. ఆ కుంభవృష్టిలో భాగమే వర్తమానకవి పల్లిపట్టు నాగరాజు 'నీలికళ్లనేల' కవితాధార.

రాయలసీమ బహుజనకవిత్వపు కెరటమై ఎగిసిన పల్లిపట్టు నాగరాజు గతంలో అస్తిత్వపోరాట సంవేదనతో, తన వూరి మాండలికపు నుడికారాన్ని రంగరించి వెలువరించిన 'యాలైపూడ్సింది' కవితాసంపుటి కేంద్రసాహిత్య యువపురస్కారంతో బాటు పలు పురస్కారాలను అందుకుంది. ఈ సంపుటిలో తన మట్టి భాషతో ఈ కవి రైతుజీవితంలోని వివిధ పార్శ్వాలనూ, సీమకరువు దృశ్యాలనూ స్పృశించాడు. తననేలతల్లి వేదనను వినిపించాడు. నానాటికీ మృగ్యమైపోతున్న మానవ సంబంధాల కోసం అన్వేషించాడు. పల్లెల్ని కబళించివేస్తున్న ప్రపంచీకరణ ప్రభంజనంపై ధ్వజమెత్తాడు. ఇప్పుడు ఈ సంపుటిలో అదే సామాజిక సంవేదనను మరింత సూటిగా, ఘాటుగా వినిపించాడు. తన కవితామార్గాన్ని శక్తివంతం చేశాడు. తనను కుదుపుతోన్న సందర్భాల్లోంచి, తాను కదిలిపోతున్న దారిమూలాల్లోంచి, నేల మూలాల్లోంచి అక్షరాల్ని వొంపుకున్నాడు. గోధుమరంగు బుగ్గలను నెత్తుటిపాలు చేసిన దేగలను వెతుకుతూ పిడికిళ్లను బిగించిన జాగా అతనికి కవితాక్షేత్రమైంది. మనసుల్ని గాయపరిచే అనేక సామాజిక సంవేదనల్ని కవిత్వం చేశాడు.

'మతపు గాజుపెంకుల్ని గుండెల మధ్య నాటి/మనిషితనానికి పాడెకడుతున్న ఏలికలదేశం/యే చీకటి గుహల్లో చిక్కిపోతాదో/యే చితికిన బొబ్బల్లో చిమిడిపోతాదో/అయినా మనకు చీమ కుట్టదు/అయినా మనకు రవ్వంతైనా సిగ్గుపుట్టదు' అంటూ కొండంత అవమానపు, అసమానపు భారాన్ని మోసే మనిషికి కర్తవ్యాన్ని బోధిస్తాడు. అతనిని జాగృతం చేసే నీలికళ్ల కోడికోసం ఎదురుచూస్తాడు. 'కనీసం గద్దలు తిరిగే ఆకాశాన్ని చూసి/గట్టిగా కేకవేసే/తల్లికోడి లాంటి అప్రమత్తమైనా/చుట్టూ వుండకపోవడమంటే/బలిపీఠంపై తలవాల్చి చచ్చే వంతు కోసం ఎదురుచూడ్డమే'(కంకులు తలవాల్చిన దృశ్యం) అంటూ బానిసత్వపు సంకెళ్లను ఛేధించుకోలేని మనిషికి అప్రమత్తతను గుర్తు చేస్తాడు. 'వేలాదే నవ్వుముఖం వెనుక/అనాదిగా పారే అశుద్ధనదిని/కనపడకుండా/ వినపడకుండా/మలిన కరచాలనాల మధ్య కప్పెట్టి/కాలాన్ని మాయ చేస్తూ కాలం గడుపుతుంటాయి... ఇల్లూడ్చుకుంటూ/వాకిలూడ్చుకుంటూ/లోపల నిండిపోయిన చెత్తనెపుడు ఊడ్చుకుంటాం'(మురికిబొమ్మ) అంటూ పరిస్థితులతో రాజీపడిపోయిన మనిషిలోపల పేరుకుపోయిన సామాజిక చెత్తను ఎలా తొలగించుకోవాలో చెబుతాడు. 'మనవి కిర్రు చెప్పులు కావు/జాతి ఎక్కుపెట్టిన గురిచెప్పులు/శతాబ్దాల మోసాలపై గుర్రు చెప్పులు/అరిగిపోయిన చెప్పుల్లో వొరిగిపోని గురివుంది/దారి గెలిచేదాకా చెప్పులిడవద్దు/దారిదాటి మనయేటి పక్కన/కయ్యదున్నేదాక కాడి పడేయద్దు'(గురిచెప్పులు) అంటూచెప్పుల్ని చైతన్యానికి ప్రతీకలుగా తీసుకుంటూచెప్పులు ఎలాంటి లక్షణాలను కలిగివుండాలో, ఆ చెప్పుల్ని ఎలా వుపయోగించుకోవాలో చెబుతూ సామాజిక హితబోధ చేస్తాడు. ఈ కవి ప్రేమను కూడా నిర్బంధాల్ని బద్దలు కొట్టే పోరాటంగా బావిస్తాడు. ప్రేమకవిత్వంలోనూ పోరాటపటిమను దర్శిస్తాడు. అందుకే 'ప్రియా మనం కాకపోతే/దేశాన్ని ఎవరు పట్టించుకుంటారు చెప్పు/మనం లేకపోతే మనుషులు ఏమైపోతారో చెప్పు'(ప్రేమతుమ్మెద) అంటాడు. 'ఎన్నెన్ని రుతువుల్ని తట్టుకుని నిలబడ్డవో/మనవూరి ముందరి పంటచేలు/ఎన్నెన్ని ప్రేమల్ని పండించి పరిమళించినవో/మన పూర్వీకుల గాధల్ని గానం చేస్తున్న తోటలు' అంటూ తన నోస్టాల్జియా కవిత్వంలో ఆ ప్రేమక్షేత్రాల దుఃఖాన్ని దర్శిస్తాడు. 'పిల్లలు చీమల్ని కన్నార్పకుండా చూస్తున్నారు/చీమలు పిల్లల్ని తలలు పైకెత్తి చూస్తున్నాయి/కులం వదలి/కుళ్లు వదలి/కలిసికట్టుగా వుండి/ప్రపంచం ముందు తలెత్తుకు బతకవచ్చని/పాఠం చెబుతున్నట్టు/అందమైన బొమ్మను చిత్రించిన నిమిషాలివి'(తరగతి గదిలో చీమలు) అంటూ తరగతి గదిలో బారులు తీరిన చీమల్లో సామ్యవాద సమాజాన్ని చూస్తాడు. ఈ సంపుటిలోని 'పుల్లలెగదోసే అమ్మలు' ఖండిక శక్తివంతమైన స్త్రీవాదాన్ని వినిపిస్తుంది. 'ఇంటిచూరుల్లోంచి సుడులు తిరుగుతూ/ఆధిపత్యపుమీసాలు దుప్పుతున్న పొగ/అహంకారపు మీసాలు మెలేస్తున్న పొగ/చేవదేలిన మాయమ్మ చేతులు తగిలి/పొయ్యి మండుకోగానే/నోరుమూసుకొని పారిపోయే పిరికిసన్నాసి పొగ/యేవాటున పొయ్యి మండేయాలో/ యేయాలప్పుడు యెట్టా పూనుకోవాలో/అమ్మలకు తెలిసినవి ఎవరికి తెలుస్తుంది' అంటూ పురుషాహంకార పొగను ఖాతరు చేయని అమ్మల ధైర్యసాహసాల్ని కవిత్వీకరిస్తాడు. 'ఎక్కాల్సిన పదవీపీఠం కోసం/ఎగరాల్సిన పార్టీ జెండా కోసం/ఊరారా తిరిగి ప్రలోభాల ఊబిలోకి ప్రజల్ని నెట్టేవాడు/మనోభావాలు చాటు మహాకుట్రలనేకం పురిపేనేవాడు'(పొలిటికల్ టెర్రరిస్టు) అంటూ ఇప్పటి రాజకీయ అనిశ్చితికి కారణాలను అన్వేషిస్తాడు.

సమకాలీన దృశ్యాలూ, సంఘటనలూ ఈ కవికలం నుంచి కవిత్వమై జాలువారాయి.'మీ నగర మేధా యాగంలో/కూలిన ఇంటి శిథిలాల కింద/పూట పూటకు ప్రేమలో/గోరుముద్దలు తినిపించే అమ్మ చెయ్యి/ నెత్తుటిముద్దై తల్లడిల్లుతోంది'(చేతులు కావాలి) అంటూ అగ్రరాజ్యాల నరమేధంలో కుప్పకూలే జీవితాల్ని దర్శిస్తూ ఆ యుద్ధ బీభత్యాన్ని అక్షరబద్ధం చేస్తాడు. 'పైరుకాడికి బోయొచ్చినప్పుడల్లా/గుండె తరుక్కుపోతుంటాది/ఇంకొక వాన ఇంకొక వానంటూ/మా కయ్యలూ, పల్లెలూ నిద్రాహారాలు మాని కలవరిస్తుంటాయి'(యింకొక వాన) అంటూ వాన కోసం తల్లడిల్లే తనవూరు దాహార్తిని వర్ణిస్తాడు. 'నా బానోపిన్నమ్మ/దుక్కించి దుక్కించి/అసమానపు దుక్కపు కొలిమిలో/పదును దేలుతున్న దుక్కానంతర భూమీ!/అన్యాయపు కొమ్ములతో కుమ్ముతున్న/ఆవుతోలు వొలిచే/నీ చేతి చినకత్తిని సానబెట్టే ఆకురాయిని నేను!/అమ్మా నీ ఆత్మగౌరవాన్ని ఏలపదంగా పాడే మారుమూల పల్లెపదాన్ని నేను'(దుక్కానంతర భూమీ) అంటూ తన కుటుంబసభ్యులతోపాటు సామూహిక అత్యాచారానికిగురైన బాల్కిస్ బానో న్యాయపోరాటానికి సంఘీభావాన్ని ప్రకటిస్తాడు. 'యుగాలనాటి రోషం/ఏ బాట కింద బిగుసుకుపోయిందో.../మాట్లాడలేకపోవడం కన్నా మహా విషాదముందా?' అంటూ వర్తమాన సమాజంలో నెలకొన్న అసలైన మహావిషాదాన్ని అభివర్ణిస్తాడు. 'ఎక్కడో అనుమానపు బొబ్బలు/వివక్షల ముళ్లకంపల్లో మునుగుతుంటాయో/ఎవరివో ఆకలిపేగులు కాలే కడుపులై గుడిసెల్లో మూలుగుతుంటారు/నా లోపల పొయ్యిలోనూ/వాక్యాల నిప్పుకల్లులు కవిత్వమై/పీడితపోరాటాల పొగరాజేస్తుంటాయి'(భూమి నుదుట మీద కవిత్వపు బొమ్మ) అంటూ తన లక్ష్యాన్ని వివరించే పల్లిపట్టు కవిత్వం 'అచ్చం అమ్మవంటి/అయ్య వంటి/అమిత ఇష్టమైన ఈ నేల దేహంపై/రవ్వంతైనా ద్వేషపు ముళ్లకంపలు మొలవని/ప్రేమ రుతువును' కలగంటుంది.

నీలికళ్లనేల
పల్లిపట్టు నాగరాజు కవిత్వం. పేజీలు:142, వెల: రూ.152. ప్రచురణ: ఛాయ, హైద్రాబాద్. ప్రతులకు: ఛాయా బుక్స్.కామ్. మొబైల్: 7093165151